

# విశాల హృదయం

వాకిట్లో వేపచెట్టు క్రింద నులక మంచం వేసుకుని పేపరు చూసుకుంటూ కూర్చున్నాడు గోపాలరావు. రైలు పెట్టెల్లో రకరకాల మనుష్యులు కలిసినట్లే పేపర్లో ఎక్కడెక్కడి విషయాల్లో సంబంధం లేకపోయినా ఒకదానిపక్క వకటి కూర్చి వుంటాయి. గోపాలరావుకి పేపరు చూస్తుంటే సినిమా చూస్తున్నట్లు వుంది.

రైలు కింద పడి ఎవరో ఆత్మహత్య చేసుకున్నారుట. పాపం! ఇంట్లో ఈగల మోత వుండి ఉంటుంది. బయట అప్పుల వాళ్ళ అరుపులు వినబడి వుంటాయి. పెళ్ళానికి పురిటి రోజులు. చంటివాడికి చలిజ్వరం. ఇంట్లో ముసలమ్మకు రోజులు నిండుకుంటున్నాయి. బియ్యం డబ్బా ఖాళీ అయింది. దుకాణంలో అరువు యివ్వనన్నాడు. అంతకంటే ఏం కావాలి. రైలు కింద ఎందుకు పడ్డాడో. బహుశా వురి పెట్టుకోవటానికి సరిపోయే తాడు ఇంట్లో లేదేమో!....

చెత్తకుండీలో పసిపిల్లవాడు దొరికిన వైనం. ఆ అభాగ్యురాలు ఎవరో, పసిపాపను పోషించుకునే తాహతు లేదేమో? పేదరికం మన దేశాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. ఆమెకే కనక పది ఎకరాల మాగాణి భూమి, భర్తకే గనక రెండు వందల రూపాయలు సంపాదించే వుద్యోగమే వుండి వుంటే, యింత ఘోరం జరిగేది గాదు. అయినా పిల్లలు లేని తల్లులు ఈ భూమి మీద యింత మంది తల్లడిలుతుంటే ఆ పసి కందును ఏ ఆసుపత్రిలోనన్నా యిచ్చేస్తే ఎంత బాగుండేది?.... యింకొక విషయం గూడా అయివుంటుంది.

పేదరికం వల్ల అనుకోవటానికి తగినంత ఆధారం కనపడదు. గొప్పవాళ్ళ యిళ్ళలో జరిగే ఘోరాల ఫలితమేమో! ఆ మధ్య ఫస్టుక్లాసు పెట్టెలో నుంచి దిండులాంటి వస్తువు రైలు పోతుండగా కింద పడిపోతే గొలుసు లాగి కిందకు దిగి చూశారు రైల్వే గార్డు మొదలయిన వాళ్లు. పీక పిసికేసి ఎవరో మహాతల్లి పసికందును గుడ్డలో చుట్టి విసిరేసిందని తెలిసింది. అది ఆమె అభిమానం తాలూకు పరిణామమట. గార్డు చేతిలో వంద రూపాయల నోటుపెట్టి తన ప్రతిష్ఠ కాపాడుకుందిట. ప్రతిష్ఠ బయటవాళ్లు కాపాడేదా, యెవరికి వారు కాపాడుకోవలసిందా? ఏమిటో ఈ ప్రపంచం వినాశానికి బయలుదేరి పోతుంది.

ఒక సామ్యవాద సిద్ధాంతి ఆవేశంలో పని మనిషిని చావకొట్టి, ఉద్రేకం చల్లారిన తర్వాత తీరికగా జైల్లో మకాం పెట్టాడుట! ఇదీ బాగానే ఉంది. చెప్పేవన్నీ చెయ్యాలని యెక్కడ వుంది! చెయ్యగలిగిన విషయాలన్నీ మళ్ళీ చెప్పట మెందుకు. పని మనుష్యులు గూడా నిజంగా మనుష్యులేననీ, వాళ్ళలో గూడా రక్తమాంసాలుంటాయని ఆయన ప్లాటుఫారం మీద ఎక్కి ఒకసారి బల్ల విరగొట్టాడుట. రక్తమాంసాలు వుండవని ఎవరు అనుకుంటారు గనక. ఎవరో యికిలిస్తే ఆయనగారు ఆయాసపడి కూర్చున్నారుట.

గోపాలరావు పేపరు పేజి తిప్పాడు. ఎవరో అడుక్కుతినేవాడు గేటు గొళ్ళెం తీసుకుని లోపలకు ప్రవేశించి, స్తంభానికానుకుని చేతిలో వున్న డబ్బాను నిర్లక్ష్యంగా ముందుకు చాచి "మిమ్మల్నే" అన్నట్టు గోపాలరావు వంక వురిమి చూచాడు! గోపాలరావు కొద్దిగా జంకాడు తనింట్లో ఒక్కడే ఉన్నాడు గదా అని. వచ్చినవాడు చూస్తే కండలు తేలి, నరాలు ఇనప తీగెల్లాగా బయటికే కనపడు తున్నాయి. తనంటే చొక్కా వేసుకున్నాడు కాబట్టి సరిపోయింది గాని, ఎవరయినా సరే, ఆవలించక పోయినా పేగులెన్ని ఉన్నాయో అతి సులభంగా లెక్కపెట్టగల స్థితిలో వుంటాడు.

"ఏయ్.... అట్లా చూస్తావెందుకు...." అన్నాడు.

"యింకా ఎట్లా చూడాలి?" అన్నట్లు ముఖం పెట్టాడు అగంతకుడు.

"మొద్దులాగా వున్నావు...ఏదయినా పని చేసుకోరాదూ..." అందరు పెద్ద మనుష్యులు అడిగే ప్రశ్నే అడిగాడు.

"ఏం.... ఎందుకు చేసుకోవాలి" అన్నాడు అడుక్కుతినేవాడు. వాడి కులం అది. అంతే.... గోపాలరావు కాలరు సర్దుకున్నాడు.

"పని చేసుకోకపోతే ఎట్లా గడుస్తుంది."

"తమరికి గడవటంలా...."

గోపాలరావు యింట్లో యినప్పెట్టె. బ్యాంకు ఎక్కౌంటు, చెక్కు పుస్తకం అన్నీ గుర్తుకు వచ్చాయి."రెండు రూపాయలివ్వండి...మళ్ళీ నేను వెళ్ళాలి" అన్నాడు అడుక్కుతినేవాడు. గోపాలరావు గుండె నోట్లోకి వచ్చింది.

"ఈ కానీ తీసుకుని పో...." జేబులో నుంచి కానీ తీసి గిరవాటు వేశాడు. ఆగంతకుడు పడిపోయిన కానీ వంక చూడనే లేదు. చొక్కా పైకెత్తి బొడ్డులో నుంచి చాకు తీశాడు.

"పైన లిప్పించండి.... పోవాలి...." అన్నాడు. గోపాలరావు కంగారుగా పర్సు తీశాడు. అయిదు రూపాయల నోటు మాత్రం ఉంది.

"చిల్లర లేదు..." అన్నాడు. గొంతుకు అర్చుకొని పోయింది.

"ఫరవాలేదు..." అన్నాడు ఆగంతకుడు చాకును బొడ్డులో దోపుకుని అయిదు రూపాయల నోటు అందుకుని "జాగ్రత్త" అన్నట్టు చూస్తూ వెళ్ళిపోయాడు.

గోపాలరావు ప్రాణం నీళ్ళు కారిపోయింది. పోలీసులకి రిపోర్టు యిద్దామనుకున్నాడు. ఖూనీ ఎందుకయిందో ఎలా అయిందో ఆరా తీయగలరు గాని అసలు హత్య జరగకుండా ఎట్లా, ఎంత కాలమని కాపాడగలరు? ప్రాణం మీద తీపి, అయిదు రూపాయల కాగితం, తన అభిమానం మీద వుండే తీపికంటే ఎక్కువగా తోచింది. కళ్ళు ముడుచుకుని పేపరు మళ్ళీ చూడటం మొదలుపెట్టాడు.

పట్టపగలు దొంగతనం యింటి యజమానికి గాయాలు.... గోపాలరావు మనస్సు చివుక్కుమంది. పేజీలు తిప్పేశాడు. అన్నిచోట్లా యిటువంటి అన్యాయాలు జరుగుతూ వుంటాయన్నమాట. అరికట్టడం ఎలాగూ అని. యిందాక వచ్చిన వాడికి తన మాగాణీ పొలంలో సగభాగం యిచ్చేసి వ్యవసాయం చేసుకోమంటే తనింటికి కత్తి తీసుకుని వచ్చేవాడేనా! అయినా ఎంతమందికి యిలా భాగం పంచి యిచ్చి తను బికారి కాగలుగుతాడు.

యీసారి యింకొకడు వచ్చాడు అస్థిపంజరం నడిచి వస్తున్నట్లుంది. గేటు అవతల నుంచే అరుస్తున్నాడు. గోపాలరావు యిందాక గిరవాటు వేసిన కానీ వెతికి వాడికి తీసుకుపోయి యిచ్చాడు. వాడికి కానీ వద్దుట తింటానికి ఏదన్నా కావాలంటున్నాడు. చలి వేస్తున్నది కాబట్టి పాత చొక్కా ఏదన్నా యిప్పించమన్నాడు. కానీ కంటే యింకా ఏమీ యివ్వదలచుకోలేదని ఖచ్చితంగా చెప్పేశాడు గోపాలరావు! వచ్చిన వాడు అన్నం పెట్టకపోతే అక్కడే చచ్చిపోతానన్నాడు. గోపాలరావు విజృంభించాడు. పేపరు మంచం మీద విసిరేసి ఆ ఎముకల గూడు మెడ ఎముక పట్టుకొని సందు చివర దాకా గెంటి వచ్చాడు.

పేపరు మీద విసుగు పుట్టింది గోపాలరావుకు. విసిరి నేలకేసి కొట్టాడు. వెనకాల వైపున పెద్ద హెడ్డింగు. జపానులో వ్యభిచార నిర్మూలనకు ప్రభుత్వ చర్యలు. ప్రజలు చర్య తీసుకోవాలి గాని ప్రభుత్వం రూలు పెడితే ఏమవుతుంది గనక. అసలు ఆ వృత్తి మాన్పించాలని అటువంటి వాళ్ళందరికి జీవనోపాధి కల్పించాలని తను చాలాకాలం నుంచి అనుకుంటున్నాడు. ఏ రకమయిన జీవనోపాధి కలిగించాలి అను విషయం మీద అతనికి చాలా అభిప్రాయాలున్నాయి. అవన్నీ గుర్తు తెచ్చుకుందా మనుకున్నాడు. బుర్ర వేడెక్కబోతుండగానే మళ్ళీ ఎవరో ఒక బిచ్చగత్తె ఒక రెండేళ్ల చంటివాడిని చంకలో వేసుకుని దణ్ణాలు పెట్టుకుంటూ వచ్చింది.

బహుశా పాతికేళ్ళు వుండి వుంటాయి. వేషం అవకరంగావున్నా ఆకారం బాగానే వుంది. అందానికి కావాల్సిన వస్తువులుగాని కళ్ళు ముక్కు వగైరాల కొలతలు గాని స్టాండర్డు కొలతలు కాకపోయినా చూడటానికి పొందికగానే వున్నాయి. ఆమెను చూస్తే జాలి కలిగింది. తన వంటి భాగ్యవంతుడు పెళ్ళిచేసుకుని వుంటే ఈ రోడ్ల వెంబడి తిరిగే కర్మ పట్టేదేనా!

ఛీ! అనుకున్నాడు. తనకు చేతనయిన సాయం చేసి పంపిద్దామనిపించింది. మనీపర్సు తీసి చూశాడు. చిల్లర లేదు. పది రూపాయల కాగితం వక్కటి మాత్రం వుంది. బిచ్చగత్తె అతని వంక చూస్తూ నిలబడింది. కత్తి తీస్తుందేమోనని భయం వేసింది. అంతకంటె వాడిగా వున్నాయి ఆమె చూపులు. పది రూపాయల కాగితం తీసి "ఇది తీసుకో" అన్నాడు.

బిచ్చగత్తె నవ్వింది. ఏమిటో అర్థం చేసుకున్నట్లు తల ఆడించింది. చిరునవ్వు ముఖంతో కాగితం అందుకని అతనివంక సూటిగా చూస్తూ యింటి లోపలి వైపుకు వయ్యారంగా అడుగులు వేసింది. అతనిలో పశుత్వం తొంగిచూచింది. చకాచకా ఆమెవైపు అడుగులువేసి లోపలకి పద అన్నట్టు చెయ్యి చూపించాడు. ఆమె అడుగులు వేసింది. అతను వెనకాల నడుస్తున్నాడు. ఆమె చేతిలో పాప అతని వంక చూసి నవ్వింది. ఆ పాపలో అతని ప్రతిబింబం కనపడింది. అతని మీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకి నట్లయింది.

ఒక్కసారిగా ఆమె చెయ్యి పట్టుకుని జరజర గేటు దాకా లాక్కుపోయి "పో అవతలకి మళ్ళీ ఎప్పుడూ ఇక్కడ అడుగుపెట్టక" అంటూ బిగ్గరగా గదమాయించాడు.

పేపరు తీసి నులకమంచం ఎత్తేసి యింట్లోకి పోయి తలుపు బిడాయించాడు. ఏదైనా పుస్తకం తీసి మనశ్శాంతి చేకూర్చుకుందామనుకున్నాడు. అలమారులో అతని చేతికి 'అసమర్థుని జీవితయాత్ర' దొరికింది.

**(ప్రజామత - 4 నవంబర్, 1956; ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ సంచిక)**